క్లుప్తంగా

నేడు విశ్వబ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనం

అచ్చంపేట రూరల్: పట్టణంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో ఈ నెల 7న శుక్రవారం విశ్వబ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించనున్నామని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు యు.లింగాచారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

పది పరీక్ష కేంద్రం తనిఖీ

బల్మూర్: స్థానిక పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని బుధవారం ఏఎస్పీ రామేశ్వర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పరీక్ష కేంద్రం పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఎవరూ గుంపులుగా ఉండరాదన్నారు.
పెద్దకొత్తపల్లి: పదో తరగతి పరీక్ష కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్స్ శ్రీనివాసులు, రమేష్ గురువారం తనిఖీ చేశారు.
వెల్దండ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మోడల్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి.

ప్రశంసాపత్రాలు అందజేత

దోమలపెంట(అచ్చంపేట): ఈగలపెంటలోని టీఎస్ జెన్‌కో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డీఏవీ ఆంగ్ల పాఠశాలలో నిర్వహించిన పాఠ్య ప్రణాళిక, ఎగ్జిబిషన్ కార్యక్రమంలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు ఎస్ఈ(సివిల్) రవీంద్ర కుమార్ గురువారం ప్రశంసా పత్రాలు అందజేశారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

రూ.7.50 కోట్లతో అభివృద్ధి పనులు

ఉప్పునుంతల: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు కృషితో మండలంలో అభివృద్ధి పనుల కోసం రూ.7.50 కోట్లు మంజూరైనట్లు జెడ్పీటీసీ అనంతప్రతాప్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక రైతు వేదిక ఆవరణలో ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ మండల నాయకులతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, కులమతాలకతీతంగా దేవాలయాలు, మసీద్‌ల నిర్మాణాలకు నిధులు మంజూరైనట్లు చెప్పారు. భూపాల్‌రావు, రవీందర్‌రావు, కట్టా గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

వెల్దండ: మండలంలోని బండోనిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని పల్గుకిందితండాలో గురువారం హనుమాన్ దేవాలయ నిర్మాణానికి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి హాజరై భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రతి గ్రామంలో హన్‌మాన్ దేవాలయాలను నిర్మించుకోవాలన్నారు. ప్రజలందరూ భక్తిభావంతో మెలగాలన్నారు. ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.లక్ష విరాళం అందజేశారు. సర్పంచ్ అంజయ్య, పాండునాయక్ పాల్గొన్నారు.

పండ్లు పంపిణీ

కల్వకుర్తి రూరల్: ముస్లిం పవిత్ర పండుగ రంజాన్‌ను పురస్కరించుకుని మున్సిపాలిటీ పరిధిలోని జయప్రకాశ్‌నగర్‌లో ఐక్యతా ఫౌండేషన్ ఎక్జిక్యూటివ్ మెంబర్ సుంకిరెడ్డి వరప్రసాద్ రెడ్డి ముస్లింలకు ఖర్జూర పండ్లను అందజేశారు. ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనం

ఉప్పునుంతల: బీఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని పోచమ్మ చౌరస్తాలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. జెడ్పీటీసీ అనంతప్రతాప్‌రెడ్డి, భూపాల్‌రావు, గోపాల్‌రెడ్డి, రవీందరావు పాల్గొన్నారు.

నాయకుల పరామర్శ

ఊర్కొండ: కొద్ది రోజుల కిందట ద్విచక్ర వాహన ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న కాంగ్రెస్ పార్టీ సేవాదల్ మండల అధ్యక్షుడు పోలే గణేష్‌ను డీసీసీ అధ్యక్షుడు, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ గురువారం పరామర్శించారు. శ్రీకాంత్ రెడ్డి, ఆరీఫ్, శ్రీనివాస్, బంగారయ్య ఉన్నారు.

వాటర్ బాటిల్స్ పంపిణీ

తాడూరు: మండలంలోని మేడిపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం వాటర్ బాటిల్స్‌ను పంపిణీ చేశారు. దాత స్వేతారామ్మోహన్ కుమార్తె సాయిపూజిత జన్మదినం సందర్భంగా వీటిని అందజేశారు. రాఘవేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేఎల్ఐ కాల్వలు పరిశీలించిన జూపల్లి

కోడేరు: మండలంలోని ఎత్తం, మైలారం గ్రామాల సమీపంలోని కేఎల్ఐ కాల్వలను మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేఎల్ఐ కాల్వల ద్వారా సాగునీరు రాకపోవడంతో రైతులు వేసుకున్న పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. రాంమోహన్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

చారకొండ: కొంతకాలంగా ఐకేపీలో వీఓఏలుగా విధులు నిర్వహిస్తున్న వారి సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 3 నుంచి 16వ వరకు సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చారకొండ మండల మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం నోటీసులు అందజేశారు. వీఓఏలు ఆన్‌లైన్ సంబంధిత పనులు పూర్తిగా బంద్ పాటించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి

కల్వకుర్తి: హనుమాన్ జయంతి వేడుకలు రెవెన్యూ డివిజన్ పరిధిలోని కల్వకుర్తి, వెల్దండ, చారకొండ, వంగూరు, ఊరుకొండ మండలాల పరిధిలో భక్తిశ్రద్ధలతో గురువారం నిర్వహించారు. పట్టణంలోని హనుమాన్ ఆలయంలో ఆంజనేయ స్వామికి లక్ష కోమాల అర్చన నిర్వహించారు. ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి ఉత్సవాల్లో పాల్గొని హనుమంతుడికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని కొత్రతండా, భగత్‌సింగ్ తండాలో హనుమాన్ జయంతి ఉత్సవాల్లో పాల్గొని పూజలు నిర్వహించారు.

కల్వకుర్తి పట్టణంలో హనుమాన్ దేవాలయం నుంచి శోభాయాత్రను గురువారం సాయంత్రం 6 గంటలకు మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం పూజలు చేసి ప్రారంభించారు. కోలాటాలు, భజనలు చేశారు. పట్టణ పురవీధుల వెంట యాత్ర సాగింది. హనుమాన్ జెండాలను, టోపీలను ధరించి యాత్రలో పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సమస్యాత్మక ప్రాంతాలు గుర్తించి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

అచ్చంపేట రూరల్: హిందూ వాహిని ఆధ్వర్యంలో గురువారం వీర హనుమాన్ శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ స్టేడియం నుంచి ప్రధాన రహదారి వెంట బస్టాండ్ వరకు, అక్కడి నుంచి పాతబజార్ వరకు యాత్ర సాగింది.

వెల్దండ: మండల కేంద్రంతో పాటు కుప్పగండ్ల, కొత్ర, పెద్దాపూర్, కొత్రతండాల్లో హన్‌మాన్ జయంతిని నిర్వహించారు. శోభాయాత్ర నిర్వహించారు.


కల్వకుర్తిలో శోభాయాత్ర

తెలకపల్లి: హనుమాన్ జయంతిని గురువారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. రవికుమార్‌రెడ్డి, ఎత్తపురవి, ఉమాపతి, నరేంద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

ఊర్కొండ: మండలంలోని ఊర్కొండపేట పబ్బతి ఆంజనేయ స్వామి దేవస్థానంలో ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. హనుమాన్ శోభాయాత్రను దేవాలయ పాలకమండలి సభ్యులు జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ అనంతరం పబ్బతి ఆంజనేయ స్వామి ఆలయం వద్ద యజ్ఞం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

లింగాల: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం హన్మాన్ జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో హనుమాన్ జయంతి వేడుకలను శివాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. హనుమాన్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం ఊరగుట్టపై హనుమాన్ విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ చేశారు. పూజల అనంతరం గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. వెంకటేశ్వర్‌రెడ్డి, దండు నర్సింహ, కాసుల సురేశ్, బీమేశ్, రఘుపతిరెడ్డి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మన్ననూర్: స్థానిక వేణుగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో కొలువైన ఆంజనేయ స్వామి ఆలయంలో అష్టోత్తర శతనామంతో పూజలు, కొబ్బరి కాయలు, కుంకుమార్చన, అభిషేకాలు చేశారు. సురేష్, వెంకటరమణ, యాదగిరి పాల్గొన్నారు.

కోడేరు: మండల కేంద్రం ఆంజనేయస్వామి ఆలయంలో స్వామి వారికి అభిషేకం, అలంకరణ తదితర పూజాలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేసినట్లు ఆలయ అర్చకుడు రాఘవేంద్రశర్మ తెలియజేశారు. అనంతరం హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు.


వెల్దండ మండలం కొత్రలో పూజలు చేస్తున్న భక్తులు

చారకొండ: మండల కేంద్రంలో, మండలంలోని జూపల్లిలో ఆంజనేయస్వామి శోభాయాత్ర పెద్దఎత్తున భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అంతకు ముందు ఆంజనేయ స్వామి దేవాలయంలో సింగిల్ విండో చైర్మన్ గుర్వయ్య గౌడ్, బీఆర్ఎస్ నాయకులు జూపల్లి వెంకటయ్య యాదవ్ పూజలు చేశారు.


కల్వకుర్తిలో అన్నదానం చేస్తున్న కసిరెడ్డి


లింగాల మండలం జీల్లుపల్లిలో..


అచ్చంపేటలో హిందూ వాహిని సభ్యుల ర్యాలీ


తెలకపల్లిలో..


ఊర్కొండలో ర్యాలీలో పాల్గొన్న భక్తులు


చారకొండలో..


మన్ననూర్‌లో..

బీజేపీతోనే దేశం అభివృద్ధి

కొల్లాపూర్: పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో బీజేపీ జెండాను ఆవిష్కరించారు. నాయకులు శేఖర్‌గౌడ్, జలాల్ శివుడు, కేతూరి నారాయణ, సాయికృష్ణగౌడ్, కద్దాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బల్మూర్: కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సారథ్యంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని బీజేపీ నాయకులు శ్రీకాంత్ అన్నారు. మండలంలోని సితారాంపూర్, బల్మూర్, గోదల్, తుమ్మెన్‌పేట, మహదేవ్‌పూర్ తదితర గ్రామాల్లో బుధవారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. పెద్దయ్య, రేణయ్య, రమేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో బీజేపీ జెండాను మండల అధ్యక్షుడు ప్రసాద్ ఆవిష్కరించారు. భరత్ చంద్ర, ప్రసాద్, వెంకట్‌స్వామి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జెండావిష్కరణ

బిజినేపల్లి: మండల కేంద్రంలో గురువారం బీజేపీ మండల అధ్యక్షుడు భూషయ్య ఆధ్వర్యంలో ఆ పార్టీ జెండాను ఆవిష్కరించారు. జెండావిష్కరణ కార్యక్రమానికి ఆయా గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై జెండాను ఆవిష్కరించారు. వెంకట్‌రెడ్డి, జాకీర్‌హుస్సేన్, నారాయణాచారి, బాలస్వామి, కృష్ణ, శికాంత్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తిపై కమలం జెండా ఎగరేస్తాం..

కల్వకుర్తి రూరల్: రాబోయే ఎన్నికల్లో కల్వకుర్తి నియోజకవర్గంలో కమలం జెండా ఎగరేయడం ఖాయమని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయంతో పాటు పలు వార్డుల్లో బీజేపీ జెండాలను ఆవిష్కరించారు. దుర్గాప్రసాద్, రాఘవేందర్‌గౌడ్, శేఖర్ రెడ్డి, రవిగౌడ్, బాబీదేవ్ తదితరులు పాల్గొన్నారు.


పెంట్లవెల్లిలో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

ఐక్యమత్యమే బలం

సమాజంలోని హిందువులందరూ ఐక్యమత్యంతో మెలిగితే తిరుగులేని శక్తిగా రాణిస్తామని శివాజీ సేవా కమిటీ అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని శివాజీ చౌక్, సుభాష్‌నగర్ తదితర ప్రాంతాల్లో కాషాయ ధ్వజాలను ఎగురవేశారు. సంతూయాదవ్, ముత్యం యాదవ్, చందు, భాస్కర్, వెంకటేశ్, ప్రశాంత్, గణేశ్, హరికృష్ణ, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు కాడెద్దు మృతి

బల్మూర్: మండలంలోని రామాజిపల్లికి చెందిన రైతు ముకురాల వెంకటయ్యగౌడ్‌కు చెందిన కాడెద్దు గురువారం పిడుగు పాటుకు గురై మృతి చెందింది. రైతు గ్రామ శివారులోని వ్యవసాయ పొలం వద్ద తన పశువులను మేపుతుండగా ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో కూడిన వర్షంతోపాటు పశువుల దగ్గర్లోనే పిడుగు పడింది. దీంతో కాడెద్దు అక్కడికక్కడే మృతిచెందిందని బాధిత రైతు వాపోయాడు. మృతిచెందిన కాడెద్దు విలువ సుమారు రూ.60 వేల వరకు ఉంటుందని, ప్రభుత్వం సాయం అందించి ఆదుకోవాలని విలపించాడు. కాగా సంఘటన స్థలాన్ని రెవెన్యూ, పశువైద్యశాఖ సిబ్బంది సందర్శించి పంచనామా చేసి, నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలియజేశారు.

మొక్కజొన్న విత్తనంపై అవగాహన

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని రామాపురంలో లక్ష్మి సీక్కా సంకరజాతి మొక్కజొన్న విత్తనాలపై కంపెనీ రీజినల్ మేనేజర్ గంగా రెడ్డి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. లక్ష్మి సీడ్స్ వారు నూతనంగా ఉత్పత్తి చేసి విడుదల చేసినటువంటి లక్ష్మి సీక్కా అనే సంకరజాతి మొక్కజొన్న విత్తనలతో కలిగే లభాల గురించి వివరించారు. గ్రామానికి చెందిన రైతు 2 ఎకరాల్లో యాసంగి పంటగా నాటుకున్నాడని చెప్పారు. మొక్కజొన్న విత్తనాలు పిచికారీ ఖర్చు చాలా తక్కువగా ఉంటుందన్నారు. అనంతరం క్షేత్ర స్థాయిలో ప్రదర్శన చేశారు.

అధికారుల పర్యవేక్షణ కరువు

అచ్చంపేట రూరల్: పట్టణంలోని 13వ వార్డులో చేపడుతున్న అభివృద్ధి పనులపై అధికారుల పర్యవేక్షణ కరువైందని ఆ వార్డు కౌన్సిలర్ అంతటి శివ ఆరోపించారు. గురువారం పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. పట్టణ అభివృద్ధి కోసం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అంకితభావంతో పనిచేస్తున్నా.. మున్సిపల్ అధికారులు, సిబ్బంది అలసత్వం వహిస్తున్నారని ఆరోపించారు. ఆ వార్డులో ఓ కాంట్రాక్టర్ పనులు దక్కించుకోగా.. మరొక బినామీ కాంట్రాక్టర్‌తో పనులు చేయిస్తున్నారని తెలిసి కూడా మున్సిపల్ ఏఈ, అధికారులు పట్టించుకోకపోవడం లేదని ఆరోపించారు. అభివృద్ధి పనులు నాసిరకంగా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

జగ్జీవన్‌రాం విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

వెల్దండ: మండల కేంద్రంలో మాజీ ఉపరాష్ట్రపతి డాక్టర్ బాబు జగ్జీవన్‌రాం జయంతిని పురస్కరించుకుని విగ్రహ ఏర్పాటుకు గురువారం సర్పంచ్ భూపతిరెడ్డి, మాదిగ ఐక్యవేదిక అధ్యక్షుడు మీసాల అంజయ్య భూమిపూజ చేశారు. అనంతరం వారు మాట్లాడారు. మహనీయుల చరిత్రలను రాబోయే తరాలకు అందించాలన్నారు. వారు చేసిన సేవలను వివరించాలన్నారు. విగ్రహ ఏర్పాటును త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. మోతిలాల్‌నాయక్, వెంకటయ్యగౌడ్, నిరంజన్, అలీ, జోగయ్య, కృష్ణ తదితరులు ఉన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

చారకొండ: కంటి వెలుగు కార్యక్రమాన్ని గ్రామాల్లో ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ వసంత సాంబయ్య గౌడ్ సూచించారు. గురువారం మండలంలోని చంద్రాయన్‌పల్లిలో వైద్య శాఖ ఆధ్వర్యంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని సర్పంచ్ వసంత సాంబయ్య గౌడ్ ప్రారంభించారు. సురేఖ, పర్వతాలు, అలివేలు, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తి రూరల్: మండలంలోని ఎల్లికల్‌లో 103 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 15 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి



నాగర్‌కర్నూల్ రూరల్: రాష్ట్రంలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లోని విద్యారంగ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజిరెడ్డి, శేకర్ డిమాండ్ చేశారు. గురువారం తమ డిమాండ్ల సాధనకు కలెక్టర్ కార్యాలయం నుంచి ధర్నా నిర్వహించి అనంతరం వినతి అందజేశారు. బదిలీలు, పదోన్నతులను ప్రభుత్వం ఈ వేసవిలోనే పూర్తిచేసి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దు హామీని అమలు చేయాలన్నారు. ప్రతి నెల 1వ తేదీన జీతాలు చెల్లించాలని, పెండింగ్ డీఏలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, అకాడమిక్ కన్వీనర్ సురేఖ, ప్రసాద్, ప్రవీన్, వెంకటేష్, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంఘాన్ని ప్రస్తావించడం సరికాదు'

నాగర్‌కర్నూల్ రూరల్: వికారాబాద్ జిల్లాలో జరిగిన 10వ తరగతి పేపర్ లీక్ వ్యవహారంలో ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తపస్ ఉపాధ్యాయ సంఘం పేరును ప్రస్తావిస్తూ.. అబాసుపాలు చేయడం సరైంది కాదని ఆ సంఘం నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు రాజారెడ్డి, కార్యదర్శి శేఖర్‌ముదిరాజ్ ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు.

నిఖిత మరణానికి కారకులైన వారిని శిక్షించాలి


నాగర్‌కర్నూల్‌లో కలెక్టర్ ఏఓ శ్రీనివాస్‌కు వినతి అందజేస్తున్న కేవీపీఎస్ నాయకులు

నాగర్‌కర్నూల్ రూరల్: నిఖిత మృతికి కారణమైన వారిని శిక్షించాలని, బాధిత కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ.. గురువారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో కలెక్టర్ ఏఓ శ్రీనివాసులకు వినతి అందజేశారు. జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న, సత్యనారాయణ, కృష్ణ, హుసేన్, రాములు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

బల్మూర్: గురుకుల పాఠశాలలో ఆత్మహత్యకు పాల్పడిన నిఖిత మృతికి కారకులైన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీస్ మండల అధ్యక్షుడు జగదీష్ డిమాండ్ చేశారు. బుధవారం అనంతవరంలో కరపత్రాలను విడుదల చేశారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

కల్వకుర్తి రూరల్: నిఖిత మరణంపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ కేవీపీఎస్ ఆధ్వర్యంలో గురువారం కల్వకుర్తిలో కలెక్టర్ ఉదయ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. నిఖిత ఉపాధ్యాయులు కొట్టిన గాయాలతో మరణిస్తే ఆత్మహత్యగా చిత్రీకరించి కేసును తప్పుదోవ పట్టించారని కలెక్టర్‌కు తెలియజేశారు. ప్రభుత్వం స్పందించి సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. జగన్, పాండు, కుర్మయ్య, మల్లయ్య, కృష్ణయ్య, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

వెల్దండ: మన్ననూర్ పాఠశాలలో మృతిచెందిన నిఖిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ.. గురువారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ చంద్రశేఖర్‌కు వినతి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నిఖితను ఉపాధ్యాయులు కొట్టిచంపారని ఆరోపించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ మండల కన్వీనర్ పాండు, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా వెంకటసత్యనారాయణస్వామి వ్రతాలు

కందనూలు: చైత్ర మాసంలో పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం జిల్లా కేంద్రంలోని రామ్‌నగర్ రామాలయంలో శ్రీరామ సహిత సత్యనారాయణ స్వామి సామూహిక వ్రతాలు భక్తులతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు వరదరాజన్ అయ్యంగార్ మాట్లాడారు. ఈ వ్రతాలు చేయడంతో భక్తులకు కోరిన కోర్కెలు, అష్ట ఐశ్వర్యాలు భక్తులకు అందుతాయన్నారు. ఆలయంలో ప్రతినెల పౌర్ణమి రోజు వ్రతాలు నిర్వహిస్తున్నారని, గురువారం కావడంతో ఆలయ ఆవరణలోని దత్తాత్రేయ స్వామికి పంచామృత విశేష అభిషేకం, ప్రత్యేక గురుదత్త పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వరదరాజన్ అయ్యంగార్, కమిటీ సభ్యులు అర్థం రవీందర్, గొల్ల రాములు, మల్లేష్, రమాదేవి, శారద భక్తులు పాల్గొన్నారు.


భక్తిశ్రద్ధలతో యజ్ఞాలు

తాడూరు: మండలంలోని సిర్సవాడలోని లక్ష్మినర్సింహ ఆలయంలో గురువారం చైత్రపౌర్ణమిని పురస్కరించుకుని పూజారి జగదీశ్వరాచార్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, అష్టోత్తర పూజ, స్వామివారి సహస్రనామహోమం, యజ్ఞాలు నిర్వహించారు. ఐతోలు గ్రామానికి చెందిన కృష్ణమ్మ, నాగయ్య దంపతుల జ్ఞాపకార్థం భక్తులకు భోజన వసతి కల్పించారు.


యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

అంబలి కేంద్రం ఏర్పాటు అభినందనీయం

అచ్చంపేట రూరల్: మానవ సేవయే మాధవ సేవ అని, ప్రతిఒక్కరూ సేవా భావం కల్గి ఉండాలని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు అన్నారు. గురువారం అచ్చంపేటలో రక్షిత మహిళా సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాన్ని ప్రభుత్వ విప్ బాలరాజు ప్రారంభించి మాట్లాడారు. కొన్నేళ్లుగా రక్షిత మహిళా సొసైటీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. వివిధ పనుల నిమిత్తం అచ్చంపేటకు వచ్చే ప్రజలు, బాటసారుల కోసం అంబలి కేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. గువ్వల అమల, మనోహర్, మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, అరుణ, రాంబాబునాయక్, జయమ్మ పాల్గొన్నారు.


అంబలి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న బాలరాజు

విగ్రహ నిర్మాణానికి భూమిపూజ

తెలకపల్లి: మండల పరిధిలోని గౌరారంలో గురువారం డా. బీఆర్ అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు సర్పంచ్ జమ్ములు ఆధ్వర్యంలో భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. దేశానికి రాజ్యాంగాన్ని అందించిన మహామేధావి అని కొనియాడారు. రాంరెడ్డి, జంగమ్మ, కమలేశ్వర్ రెడ్డి, మల్లయ్య, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి పని

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీఓ గంగామోహన్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో జాబ్‌కార్డు ఉన్న ప్రతికూలికి పని కల్పించాలన్నారు. ముందస్తుగా గ్రామసభలు నిర్వహించి గ్రామాల్లో కొనసాగుతున్న పనుల వివరాలను తెలియజేయాలన్నారు. సమావేశంలో ఏపీఓ ప్రవీన్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చారకొండ: గ్రామాల్లో ఉపాధి కూలీల హాజరు సంఖ్యను పెంచాలని ఎంపీడీఓ జయసుధ అన్నారు. మండలంలోని తుర్కలపల్లి, తిమ్మాయిపల్లిలో గురువారం ఎంపీడీఓ జయసుధ ఉపాధిహామీ పనులు పరిశీలించి, కూలీల మస్టర్‌లో కూలీల హాజరు నమోదు చేసి మట్లాడారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరూ పనులకు రావాలన్నారు. ఉదయం 8 గంటలకు పనులు ప్రారంభించాలని అన్నారు. పనిలో కొలతల ప్రామాణికం పాటించాలని, ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో వాటర్ బాటిల్ తీసుకురావాలని సూచించారు. వారి వెంట ఎంపీఓ వెంకటేష్, టీఏలు, ఎఫ్ఏలు తదితరులు ఉన్నారు.


తుర్కలపల్లిలో కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ జయసుధ

కార్మిక చట్టాలకు తూట్లు

నాగర్‌కర్నూల్ రూరల్: దేశంలో కార్మికవర్గాన్ని ఐక్యం చేస్తూ.. ఐక్య పోరాటాలకు నాయకత్వం వహిస్తూ.. కార్మికవర్గానికి అండగా నిలబడిన రణదివే ఆశయ సాధనకు కృషిచేద్దామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. గురువారం ఆయన 33వ వర్ధంతిని నిర్వహించారు. బీజేపీ నాయకత్వంలో కార్మిక చట్టాలకు తూట్లు పొడుస్తూ.. శ్రామికవర్గాన్ని అణచివేస్తూ.. హక్కులు లేకుండా చేస్తున్న బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్మికవర్గం నిలబడాలని పిలుపునిచ్చారు. దేశంలో కార్మిక చట్టాలను పెట్టుబడిదారులకు చుట్టాలుగా మార్చివేసి పని గంటలు పెంచడం, హక్కులు లేకుండా చేయడం సరికాదన్నారు. సీఐటీయూ నాయకులు హుస్సేన్, కృష్ణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తెలకపల్లి: సీఐటీయూ వ్యవస్థాపకులు, కార్మిక నాయకులు రణదివే 33వ వర్ధంతి సందర్భంగా తెలకపల్లిలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు నందిపేట భాస్కర్ మాట్లాడారు. రణదివే సీఐటీయూను స్థాపించి కార్మికుల కోసం పోరాటాలు చేసని గొప్ప వ్యక్తి అన్నారు. కార్మిక కర్షకుల కోసం నిరంతరం ప్రజల మధ్యే ఉంటూ ఎన్నో ఉద్యమాల ద్వారా కార్మిక హక్కుల కోసం పోరాడిన మహానాయకుడని అన్నారు. కాశన్న, గోపాల్, ఉస్సేన్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.